రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

నెన్నెల, జూలై 2: రైతుభరోసా పథకాన్ని అమలు చేసేందుకు రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు డీఆర్‌ఏవో రాథోడ్ బిక్కు తెలిపారు. నెన్నెల రైతువేదికలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గతంలో వ్యవసాయేతర భూములకు కూడా పెట్టుబడి సాయం చేశారన్న ఆరోపణలు రావడంతో ప్రస్తుతం రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మేకల మల్లేష్, జేఏ నితిన్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సీఈవో రాజేష్‌గౌడ్, అంజన్న పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూరు, జూలై 2: సింగరేణి, ఎల్ఐసీ తదితర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. టౌన్ ప్రెసిడెంట్ చెన్న సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చీర్ల సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బాపగౌడ్‌లు మాట్లాడుతూ సింగరేణి సంస్థను కాలగర్భంలో కలిపివేసే కుట్రలను ప్రధాని మోదీ చేస్తున్నారన్నారు. వేలం ద్వారా బొగ్గు గనులను కార్పొరేట్లకు అప్పజెప్పే కుట్రలు చేస్తున్నారన్నారు. అంబానీ, ఆదానీల కుటుంబాల సంక్షేమం కోసమే ప్రధాని పని చేస్తున్నారని, సామాన్య ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు బషీర్, హేమంత్‌రెడ్డి, సుశీల్‌కుమార్, శ్రీనివాస్, నాగరాజు, మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది పరిషత్ కార్యవర్గం



ఏసీసీ, జూలై 2: న్యాయవాది పరిషత్ జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా డేగ రవీందర్, ప్రధాన కార్యదర్శి తుల ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా సాగె గురవయ్య, లక్ష్మీరాజం, కార్యదర్శులుగా ఇండ్ల వెంకటి, వెలుముల సతీష్, జైపాల్‌రెడ్డి, కోశాధికారిగా సురేందర్‌చారి, జాయింట్ సెక్రెటరీలుగా నరేందర్, నటేశ్వర్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రాణి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దండేపల్లి, జూలై 2: దండేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ పూర్తి

శ్రీరాంపూర్, జూలై 2: సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం కౌన్సెలింగ్ జరిగింది. పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల పిల్లలకు 150 సీట్లు ఖాళీగా ఉండగా, కౌన్సెలింగ్ ద్వారా 46 మంది వివిధ కోర్సుల్లో ప్రవేశం పొందారు. ప్రిన్సిపాల్ పి. శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియా నియంత్రణకు ప్రత్యేక చర్యలు




పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, డీఎంహెచ్‌వో

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 2: వర్షాకాలంలో డయేరియా ప్రబలకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో అనితతో కలిసి డయేరియా అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 31 వరకు డయేరియా నియంత్రణ అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రతీ ఇంటిని సందర్శించి 5 ఏళ్ళ పిల్లలను గుర్తించి వారి వివరాలను సేకరించాలని, నీటి విరేచనాలు ఉన్నట్లయితే ఓఆర్ఎస్ ద్రావణం, వయస్సుల వారీగా జింక్ మాత్రలను అందించాలన్నారు. పారామెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలకు డయేరియా నియంత్రణపై తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలందరు నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని సూచించారు. పర్యవేక్షకులు విశ్వేశ్వర్‌రెడ్డి, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మంత్రి పదవి ఎవరికో..?

ముమ్మర ప్రయత్నాల్లో ఆశావహులు

- పైరవీల కోసం ఢిల్లీ చుట్టు ప్రదక్షిణలు
- రేసులో నలుగురు ఎమ్మెల్యేలు



మంచిర్యాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మంత్రివర్గ విస్తరణకు సమాయత్తం అవుతుండటంతో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. మంచిర్యాల జిల్లా నుంచి మంత్రి పదవి ఎవరికి దక్కుతుందోనన్న చర్చ ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్‌లతోపాటు నిర్మల్ జిల్లా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రస్తుతం మంత్రి పదవి రేసులో ఉన్నారు.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన మంత్రి పదవుల కేటాయింపు ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో మంత్రి పదవి కోసం ఆశావహులు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం కాంగ్రెస్‌కు ఊపు రాగా, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించింది. మంచిర్యాల నుంచి గెలుపొందిన ప్రేంసాగర్‌రావు 2007-13 వరకు ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీగా పదవిని అలంకరించారు. 2018లో మంచిర్యాల అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. పీఎస్సార్‌కే మంత్రి పదవి దక్కు తుందని కాంగ్రెస్ వర్గాలు విశ్వసిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి దివంగత కాకా వెంకటస్వామి తనయులైన బెల్లంపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్‌లు సైతం మంత్రి పదవి రేసులో ఉన్నారు. గడ్డం వినోద్ 2004లో చెన్నూరు ఎమ్మెల్యేగా ఎన్నికకాగా 2009 వరకు కార్మికశాఖ మంత్రిగా పని చేశారు. గడ్డం వివేక్ 2009-14 వరకు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా సేవలందించారు. తిరిగి 2014లో పెద్దపల్లి పార్లమెంటు నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మొదటిసారిగా ఎమ్మెల్యే బరిలో నిలిచిన ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఖానాపూర్ నియోజక వర్గం ఎమ్మెల్యేగా ఎన్నికైన వెడ్మ బొజ్జు సైతం మంత్రి పదవి రేసులో ఉన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ గిరిజన జిల్లాగా పేరుండటంతో ఆదే సామాజిక వర్గానికి చెందిన బొజ్జుకు పదవి దక్కుతుందనే ప్రచారం కూడా సాగుతోంది.

ఢిల్లీ చుట్టు ప్రదక్షిణలు

మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ పట్ల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుండటంతో ఆశావహులు తమదైన శైలిలో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లా నుంచి బరిలో ఉన్న ప్రేంసాగర్ రావు, వినోద్, వివేక్‌లు సీనియర్లు కావడంతో ఢిల్లీలో సంబంధాలున్నాయి. ప్రేం సాగర్‌రావుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నుంచి స్పష్టమైన హామీ ఉంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నస్పూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తే ప్రేం సాగర్‌రావుకు మంత్రి ఇవ్వనున్నట్లు ఖర్గే ప్రకటించారు. దీంతో ప్రేంసాగర్‌రావు ఇటీవల ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ పెద్దలతో మంతనాలు జరిపారు. వినోద్, వివేక్‌లకు సైతం ఢిల్లీలోని పార్టీ అగ్రనేతలతో సత్సంబంధాలున్నాయి. వీరు సైతం కొద్ది రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసి మంత్రి పదవి దక్కించుకునేందుకు మంతనాలు సాగించారు. మంత్రి పదవి ఎవరిని వరిస్తుందోనన్న ప్రచారం జిల్లాలో ప్రస్తుతం జోరుగా సాగుతోంది.

పర్యావరణ పరరిక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి



కోటపల్లి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న కలెక్టర్, బెల్లంపల్లిలో మొక్కనాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే, చెన్నూరు డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న డీఆర్‌డీవో

కోటపల్లి, జూలై 2: పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివారణకు ప్రతీ ఒక్కరు విరివిగా మొక్కలు నాటాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా మంగళవారం కోటపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని అన్ని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాల్లో మొక్కలు నాటాలని పేర్కొన్నారు. అందరు బాధ్యతగా పరిగణించాలని, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, యువకులు సమన్వయంతో మొక్కలు నాటాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ కిషన్, ఎంపీపీ మంత్రి సురేఖరా మయ్య, డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ దత్తరాం, ఎంపీ డీవో ఆకుల భూమన్న, ఎంఈవో తిరుపతిరెడ్డి, ఏపీ వో బాలయ్య, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, ఏపీవో వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములై మొక్కలు నాటాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి పేర్కొన్నారు. కన్నాల రైతువేదిక ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, ఓబీసీ స్టేట్ వైస్ చైర్మన్ బండి ప్రభాకర్, ఎంపీటీసీ మ హేందర్, మాజీ సర్పంచు మంద అనిత, నాయకులు హరీష్, భరత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నూరు: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని డీఆర్‌డీవో కిషన్ పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటి నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకుని భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలన్నారు. ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, ఎంపీడీవో మోహన్, ఎంపీవో బీరయ్య, ఎంపీటీసీ శ్రీనివాస్, ఏపీవో గంగాభవానీ, టీఏ మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: మొక్కల పెంపకంతోనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని ఎంపీపీ గోదారి రమాదేవి పేర్కొన్నారు. గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఎంపీడీవో సత్యనారాయణతో కలిసి మొక్కలు నాటారు. ఎంపీపీ మాట్లాడుతూ పిల్లల పుట్టిన రోజు, పెళ్లి రోజులకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. ప్రిన్సిపాల్ బాలభాస్కర్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మంతెన లక్ష్మణ్, కార్యదర్శి ఉదయ్ పాల్గొన్నారు.

వేమనపల్లి: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీటీసీ రుద్రభట్ల సంతోష్ అన్నారు. నీల్వాయి గ్రామ పంచాయతీలో మొక్కలు నాటారు. మండలంలోని 14 గ్రామాల్లో వారం రోజులపాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇంటికి 6 పండ్ల మొక్కల చొప్పున, ఇతర ప్రదేశాల్లో మొత్తం 89,600 మొక్కలు నాటాల్సి ఉందన్నారు. తహసీల్దార్ రమేష్, ఎంపీవో అనిల్‌కుమార్, సీడీసీఎల్‌ఆర్‌సీ సురేష్, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, సాంకేతిక సహాయకులు కృష్ణమోహన్, కార్యదర్శి అశోక్, సాబీర్ అలీ, గాలి మధు, తిరుపతిరెడ్డి, సమ్మయ్య, రాజన్న పాల్గొన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట, జూలై 2: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ కాలేజీలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లతోపాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ బాలికల కోసం ప్రత్యేక వసతి సౌకర్యం ఉందన్నారు. విద్యార్థులు ఈనెల 5లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

జన జాతర సభ కరపత్రాల విడుదల

చెన్నూరు, జూలై 2: పట్టణంలో మంగళవారం మాదిగల జన జాతర సభ కరపత్రాలను ఎంఆర్‌పీఎస్ తెలంగాణ కోఆర్డినేటర్ మాతంగి ఓదెలు మాదిగ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 7న ఊదుముడి గ్రామంలో తలపెట్టిన మాదిగల జన జాతర సభను విజయవంతం చేయాలని కోరారు. మందకృష్ణ మాదిగ వల్ల మాదిగ సమాజానికి నష్టమే ఎక్కువగా ఉందన్నారు. శ్రీనివాస్, రాజబాపు, తిరుపతి, జైపాల్, సంజయ్, తిరుపతి, కృష్ణ, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలకు ఎంపికైన వారి జాబితా విడుదల

ఏసీసీ, జూలై 2: రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలకు ఎంపికైన జిల్లా విద్యార్థుల జాబితాను డీవైఎస్‌వో కీర్తిరాజ్‌వీరు మంగళవారం విడుదల చేశారు. బండారి రక్షిత, కంటే మిస్‌రనత, అయాన్, సుశాంత్, శివ, ఆయాన్స్, ఐశ్వర్య, హస్వి, ఆద్య, శ్రీనిత్య, శ్రీకృతిలు గత నెల 28న నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో మంచిర్యాల జిల్లా నుంచి ఎంపికయ్యారని తెలిపారు. వీరంతా కుల ధ్రువీకరణ, ఆధార్‌కార్డు, తదితర సర్టిఫికెట్లతో ఈ నెల 7న హైద్రాబాద్‌లోని హకీంపేటలోని క్రీడా పాఠశాలలో రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9963539234లో సంప్రదించాలన్నారు. విద్యార్థుల వెంట తల్లిదండ్రులు వెళ్లాలన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీ

మంచిర్యాల అర్బన్, జూలై 2: రామగుండం కమిషనరేట్ పరిధిలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆపరేషన్ ముస్కాన్-ఎక్స్ టీమ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, పలు శాఖల అధికారులతో కలిసి సీపీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ గతంలో నమోదైన కేసుల డేటా ఆధారంగా బాల కార్మికులుగా పనిచేస్తున్న హాట్ స్పాట్‌పై నిఘా ఉంచాలని, గతంలో రెస్క్యూ చేసిన పిల్లల పరిస్థితి తెలుసుకోవాలని, స్కూల్ డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి మళ్లీ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఆరోగ్యం బాగా లేని వారిని ఆసుపత్రిలో చేర్పించి పరీక్షలు నిర్వహించి చికిత్స అందేలా చూడాలని, ప్రతీ షాపు వద్ద 'నో చైల్డ్ లేబర్ ఆర్ ఎంప్లాయిడ్ హియర్' అనే బోర్డులను ఏర్పాటు చేయించాలని, బాల్య వివాహాలను అరికట్టేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల కార్మికులు కనిపిస్తే 1098, 100కు సమాచారం అందించాలన్నారు. డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, సీనియర్ ఏసీపీ వెంకటస్వామి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ పెద్దపల్లి, మంచిర్యాల చైర్మన్లు శ్రీధర్, వహీద్, మంచిర్యాల డీడబ్ల్యూవో చిన్నయ్య, డీఎంహెచ్‌వో అనిత, పెద్దపల్లి డీప్యూటీ డీఎంహెచ్‌వో కృపారాణి, తదితరులు పాల్గొన్నారు.

దీక్షను విజయవంతం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

చెన్నూరు, జూలై 2: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈ నెల 7న హైద్రాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టే ఎంఆర్‌పీఎస్ దీక్షను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ కోరారు. మంగళవారం చెన్నూరులో దీక్ష కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 1994, జూలై 7న మొదలైన ఎంఆర్‌పీఎస్ ఉద్యమం 30 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా వర్గీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వైఖరికి నిరసనగా దీక్షకు శ్రీకారం చుట్టామన్నారు. కేంద్రంలో పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీజేపీ వర్గీకరణ అంశాన్ని పక్కన పెట్టి మాదిగ జాతిని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. దీక్షలో కుల, విద్యార్థి, మహిళ, ప్రజా సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శ్రావణ్, ప్రశాంత్, మల్లేష్, శ్రీనివాస్, పోచం, శ్రీధర్, వెంకటేష్, ఇంద్ర, దయాకర్ పాల్గొన్నారు.

కార్మిక బిడ్డలు పోరాటాల్లో భాగస్వాములు కావాలి

- మావోయిస్టు రాడికల్స్ విభాగం పిలుపు

మంచిర్యాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల బిడ్డలు తమ బంగారు భవిష్యత్తు కోసం ప్రత్యక్ష పోరాటంలో భాగస్వాములు కావాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) రాడికల్స్ విభాగం మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి చట్టాలలో మార్పులు చేస్తోందని, సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణతో కార్మిక బిడ్డల భవిష్యత్తు అంధకారం అవుతుందని పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంతో కార్మిక బిడ్డలు పరాయి వ్యక్తుల్లా బతకాల్సిన పరిస్థితులు నెలకొంటాయని, ఉద్యోగాలు లేక జీవితాలు ఛిద్రమైపోతాయని తెలిపింది. దోపిడీ పాలక వర్గాలు మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చి వారసత్వ ఉద్యోగులు ఇవ్వకుండా మోసం చేస్తున్నాయని ఆరోపించింది. సింగరేణిని కాపాడుకునేందుకు కార్మికులు చేస్తున్న పోరాటాలలో వారి బిడ్డలు పాల్గొనడం ద్వారా తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించింది. ఇందులో భాగంగా ఈ నెల 5న తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని, ఈ పోరాటంలో కార్మిక బిడ్డలు ముందు వరుసలో ఉండి, నాయకత్వం వహించాలని పిలుపునిచ్చింది.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు

బెల్లంపల్లి, జూలై 2: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం బెల్లంపల్లిలోని ఏసీపీ కార్యాలయం, బెల్లంపల్లి రూరల్ సీఐ కార్యాలయం, తాల్ల గురిజాల, వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లను ఏసీపీ రవికుమార్‌తో కలిసి సందర్శించారు. డీసీపీ పోలీస్‌స్టేషన్‌ల పరిసరాలను పరిశీలించారు. పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలు, భౌగోళిక పరిస్థితులు, గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసమే పోలీసులు పనిచేస్తున్నారని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని న్యాయం చేయాలన్నారు. పెట్రోలింగ్, వాహనాల తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. డీసీపీ వెంట రూరల్ సీఐ అబ్జలోద్దీన్, ఇన్‌స్పెక్టర్ దేవయ్య, ఎస్‌ఐలు నరేష్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


బెల్లంపల్లి పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ భాస్కర్

యువత ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసకావద్దు

బెల్లంపల్లి(తాండూర్): యువత ఆన్‌లైన్స్ గేమ్స్‌తోపాటు మత్తు పదార్థాలకు బానిస కావద్దని సీఐ కుమారస్వామి పేర్కొన్నారు. మంగళవారం మహాత్మాజ్యోతి బాపూలే సాంఘిక సంక్షేమ పాఠశాలలో మత్తు పదార్థాల నిర్మూలన, సైబర్ క్రైం, ఆత్మహత్యలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. చిన్న చిన్న విషయాలకే ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఇది సరైంది కాదన్నారు. ఎలాంటి సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా, ఓటీపీ నెంబర్లు చెప్పవద్దన్నారు. ఈ విషయాలను తల్లిదండ్రులకు, బంధువులకు తెలియజేయాలని సూచించారు. ఎస్‌ఐ కిరణ్‌కు మార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజ సేవలో లయన్స్ క్లబ్ సభ్యులు భాగస్వాములు కావాలి

దండేపల్లి, జూలై 2: సమాజ సేవలో లయన్స్ క్లబ్ సభ్యులు భాగస్వాములు కావాలని లయన్స్ క్లబ్ జిల్లా రెండో గవర్నర్ మోర బద్రేశం అన్నారు. మ్యాదరిపేటలో దండేపల్లి లయన్స్ క్లబ్ 4వ వార్షికోత్సవం పురస్కరించుకొని కమిటీని ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ అని తోటి వారికి సహాయం అందించినప్పుడు మనకు తృప్తి కలుగుతుందన్నారు. అనంతరం మండల అధ్యక్షుడిగా మాదంశెట్టి మల్లిఖార్జున్, ప్రధాన కార్యదర్శి కోండు జనార్దన్, కోశాధికారి కర్నె నరేందర్, ఉపాధ్యక్షులుగా బొలిశెట్టి రాజన్న, కుంచె కిషన్, గడ్డం రాంచందర్‌తోపాటు పలు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో అంజీత్‌రావు, రాజన్న, భూమేష్, సత్యనారాయణ, పాల్గొన్నారు.



మ్యాదరిపేట లయన్స్ క్లబ్ సమావేశంలో నాయకులు

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 2: ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి వంటశాల, భోజనశాల, తరగతి గదులు, రిజిష్టర్‌లు, రికార్డులను పరిశీలించారు. ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్యాబోధన చేయాలని, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాన్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు, విష జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాల, వసతి గృహం ఆవరణలో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాల అర్బన్, జూలై 2: ఇంటర్ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టీవీయువీ) నాయకులు జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి శైలజకు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటర్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు సదరు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా తమ వద్దనే డిగ్రీ చేయాలంటూ విద్యార్థులను ఒత్తిడి పెడుతూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. బచ్చలి రమేష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



డీఐఈవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

హాజీపూర్, జూలై 2: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం తహసీల్దార్‌కు బీజేవైఎం నాయకులు వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ గ్రూప్ 2, 3 నోటిఫికేషన్‌లలో అదనంగా పోస్టులు పెంచాలని, మహిళ అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని, పోలీసు కానిస్టేబుల్ నియామకాల్లో జీవో నెంబరు 46ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని కోరారు. ప్రశాంత్, నరేష్, రాజ్‌కుమార్, యాదగిరి, సురేష్, శ్రీకాంత్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు

మంచిర్యాల అర్బన్, జూలై 2: సాయికుంట ఏరియాలో ఏర్పడుతున్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్, ప్రజలు ఇచ్చిన వినతిపై అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఏడీ వేణుగోపాల్, లైన్‌మన్ శ్రీనివాస్‌తో కలిసి ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు బదులు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తామని, వైర్లను లాగించి, అవసరమైన ప్రాంతాల్లో స్తంభాలు వేస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ ఉన్నారు.

స్లేట్ పాఠశాలలో ఎన్నికలు

జన్నారం, జూలై 2: జన్నారంలోని స్లేట్ పాఠశాలలో 2024-25 సంవత్సరానికి మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. జల్ హౌస్, వాయిస్ హౌస్, అగ్నిహౌస్, పృధ్వీహౌస్‌లుగా విడిపోయి ప్రతి హౌస్ నుంచి ఒక కెప్టెన్, వైస్ కెప్టెన్, కలిసి ఒక స్కూల్ కెప్టెన్‌ను ఎన్నుకున్నారు. పాఠశాల ఫౌండర్ శ్రీకాంత్‌రెడ్డి, స్లేట్ గ్రూపు చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డిలు ఎన్నికైన వారికి నాయకత్వ విధానాలు, క్రమశిక్షణ గురించి వివరించారు. డీన్ పూజ, ప్రిన్సిపాల్ శిరిన్ పాల్గొన్నారు.

హాస్టల్ ఎదుట టేలాను తొలగించాలి

బెల్లంపల్లి, జూలై 2: మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్టీ హాస్టల్ ఎదుట టేలాను తొలగించాలని మంగళవారం ఎంసీపీఐయూ నాయకులు మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. టేలాలో సిగరెట్, గుట్కాలు విక్రయిస్తున్నారని, విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడే అవకాశం ఉందన్నారు. వెంటనే టేలాను తొలగించాలని లేకుంటే ఆందోళనలు చేస్తామని తెలిపారు. ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్, పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్ పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

మంచిర్యాల అర్బన్, జూలై 2: మంచిర్యాల మహిళా తరంగిణి (మమతా) ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పలువురు వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైద్యులు సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు రాచకొండ మంజుళ కృష్ణరావు, ఉపాధ్యక్షురాలు లీలా, కార్యదర్శి లత, సహాయ కార్యదర్శి పావణి, కోశాధికారి నాగమణి పాల్గొన్నారు.

కాంగ్రెస్ వార్డు కమిటీల ఎన్నిక

ఏసీసీ, జూలై 2: మంచిర్యాల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వార్డు కమిటీల ఎన్నికను మంగళవారం నిర్వహించారు. 9వ వార్డు అధ్యక్షునిగా ఎడ్ల మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా అంకం సతీస్, ఉపాధ్యక్షులుగా మహేందర్‌రెడ్డి, పోశం, 8వ వార్డు అధ్యక్షునిగా పూరెళ్ల రాజన్న, ప్రధాన కార్యదర్శిగా కోడి శ్రీధర్, ఉపాధ్యక్షులుగా లవన్, రాజులను ఎన్నుకున్నారు.

కంపోస్టు ఎరువు తయారు చేయాలి

కోటపల్లి, జూలై 2: కంపోస్టు ఎరువు తయారీ నిరంతరం కొనసాగించాలని ఎంఈఓపవో సత్యనారాయణ సూచించారు. మంగళవారం మండలంలోని ఆల్గామయ గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్‌లను సందర్శించి కంపోస్టు పిట్‌లో కంపోస్టు ఎరువుల తయారీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కంపోస్టు పిట్‌లో వాన పాములు బతికి ఉండేలా చూడాలని,, కంపోస్టు ఎరువులను విక్రయించి అట్టి రూపాయలను గ్రామపంచాయతీ సాధారణ నిధిలో జమ చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను ప్రతి రోజు నిర్వహించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు ఆయన వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్, జూలై 2: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రహెమాన్ కోరారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరహత్‌అలీలను మంగళవారం రహెమాన్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి వారిని సన్మానించారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

కాగజ్‌నగర్, జూలై 2: జాతీయ రహదారుల శాఖ మంత్రి కేంద్ర మంత్రి నితిన్ గడ్కారిని ఢిల్లీలో ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు కలిశారు. జాతీయ రహదారి పనులు త్వరితగతిన చేపట్టాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కెరమెరి, జూలై 2: బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు విజేష్, మురళీ, విజయ, స్వప్న, గణేశ్‌ను మంగళవారం జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం ఆడె ప్రకాష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, భరత్, పాల్గొన్నారు.

ఏటీఎం డబ్బులు కాజేసిన నిందితులు అరెస్టు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

మంచిర్యాల అర్బన్, జూలై 2: సీఎంఎస్ కంపెనీ కస్టోడియన్‌లో విధులు నిర్వహించే ఇద్దరు ఏటీఎం మిషన్లలో డబ్బులు జమ చేయకుండ సొంతానికి వాడుకోగా వారిని అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్ తెలిపారు. మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వివరాలు వెల్లడించారు.

దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్ గ్రామానికి చెందిన బోడకుంట మోహన్, సీసీసీ హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన రేణిగుంట్ల పూర్ణచందర్‌లు సీఎంఎస్ కంపెనీలో కస్టోడియన్ విధులు నిర్వహిస్తున్నారు. ఎస్‌బీఐ బ్యాంకు నుంచి నగదును తీసుకొని ఏటీఎంలలో జమ చేయకుండ ఆరు నెలలుగా కొంత నగదును దొంగిలించి ఇద్దరు సమానంగా పంచుకునే వారని తెలిపారు. గత నెల 26న ఏటీఎం చెకింగ్‌కు వస్తున్నారని తెలుసుకున్న వారు డబ్బుల దొంగతనం విషయం తెలిసిపోతుందని ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకొని పారిపోయారు. ఆడిట్ తనిఖీల్లో రూ.1.25 కోట్లు కాజేసినట్లు నిర్ధారణ కావడంతో సదరు కంపెనీ వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నేరస్తులు మంచిర్యాల బస్టాండుకు వచ్చారని తెలిసి వారిని పట్టుకుని విచారించారు. కొంత కాలంగా విలాసాలకు అలవాటు పడి, ఇంటి అవసరాలకు డబ్బులను వాడుకున్నట్లు విచారణలో ఒప్పుకున్నారని తెలిపారు. వారిని కోర్టులో హాజరు పర్చినట్లు రిమాండ్ తరలించినట్లు ఏసీపీ వెల్లడించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ బన్సీలాల్ ఉన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

నెన్నెల, జూన్ 2: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సెంట్రలైజ్డ్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ సాయంతో రికవరీ చేసి మంగళవారం బాధితుడికి అందజేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన అల్లంపల్లి సంతోష్ పది రోజుల క్రితం బెల్లంపల్లికి వెల్తుండగా మార్గమధ్యలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. అదే రోజు ఫిర్యాదు చేయగా సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి అందజేశామన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 2: పార్లమెంట్ సమావేశంలో హిందువుల మనోభావాల దెబ్బతీసేలా మాట్లాడినందుకు జిల్లా కేంద్రంలో మంగళవారం హిందూ సంఘాల నాయకులు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్‌గాంధీ హిందువులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు రవీందర్, శ్రీనివాస్, శ్రీకాంత్, సంజీవ్, హరికృష్ణ, సంతోష్, మల్లేష్, రాజబాబు, వెంకటేష్, పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

మందమర్రిటౌన్, జూలై 2 : పట్టణంలోని లక్ష్మీ భవానీ కాలనీకి చెందిన కొమ్ము రాజేష్ అనే వ్యక్తి నివాసంపై మంగళవారం ఊరు మందమర్రికి చెందిన సది, అరుణ్, ముజాయిద్, భీంసేన్‌లు దాడి చేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. భూమికి సంబంధించిన లావాదేవీల విషయంలో కొన్ని రోజులుగా వీరు గొడవ పడుతున్నారని, పాత కక్షలతో దాడి చేసినట్లు తెలిపారు. రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అతిగా మద్యం సేవించి యువకుడి మృతి

ధర్మపురి, జూలై 2: జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని కమలాపూర్ చౌరస్తా వద్ద నల్ల మల్లేష్ (35) అనే తాపీ మేస్త్రీ సోమవారం రాత్రి అతిగా మద్యం సేవించి నిద్రలో మృతి చెందాడు. దండేపల్లి మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ ఆరు ఏళ్ల క్రితం భార్యకు విడాకులు ఇచ్చి తల్లితో కలిసి ఇక్కడే ఉంటున్నాడు. మద్యానికి బానిసై ఎక్కడపడితే అక్కడే పడుకుంటున్నాడు. గత రాత్రి అతిగా తాగి కమలాపూర్ చౌరస్తా వద్ద పడుకొని ఉండగా నిద్రలోనే మృతి చెందాడు. మల్లేష్ తల్లి పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

సాగును అడ్డుకుంటున్న అటవీ అధికారులు

● పొలాల వద్ద రైతుల నిరసన

చెన్నూరు, జూలై 2: పొలాల్లోకి వెళ్లవద్దని అటవీ శాఖ అధికారులు దౌర్జన్యం చేస్తున్నారని ఆస్నాద్ గ్రామ రైతులు పేర్కొన్నారు. మంగళవారం పంట భూముల వద్ద రైతులు మాట్లాడుతూ ఫారెస్టు అధికారులు పంట భూముల్లోకి వెళ్లవద్దని, భూముల్లోకి వస్తే ఫారెస్టు యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. అధికారులు ఎప్పుడు ఏం చేస్తారోననే పొలాల వద్ద కాపలా కాయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు పట్టాలు ఉన్నాయని, భూముల్లో వరి, పత్తి గింజలు వేసుకుంటామని అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. 582, 729, 730, 732 సర్వే నెంబర్లలో 68 హెక్టార్ల భూమిలో ఉన్నామని, ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు తమకు పట్టాలు ఇచ్చారన్నారు. 2010 నుంచి భూములు తమవని ఫారెస్టు అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కలెక్టర్ స్పందించి వ్యవసాయం చేసుకునేలా చూడాలని కోరారు.


పొలాల వద్ద పాసు పుస్తకాలు చూపుతున్న మహిళలు

అంజనీపుత్ర ఎస్టేట్స్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న గుర్రాల శ్రీధర్

మంచిర్యాల అర్బన్, జూలై 2: జిల్లా కేంద్రంలోని రియల్ ఎస్టేట్ సంస్థ అంజనీపుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు బెస్ట్ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ కంపెనీ అవార్డు లభించింది. స్విఫ్ట్ అండ్ లిఫ్ట్ మీడియా అండ్ టెక్ ఎల్ఎల్పి యేటా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న సంస్థలకు బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేస్తోంది. 2024 సంవత్సరానికి బెస్ట్ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ కంపెనీగా అంజనీపుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఎంపిక చేసింది. సోమవారం రాత్రి హైదరాబాద్ అబిడ్స్‌లో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.

సంస్థ ఫౌండర్ అండ్ సీఈవో నీలేష్ సాబే, సినీనటి భూమికా చావ్లా చేతుల మీదుగా అంజనీపుత్ర ఎస్టేట్స్ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవి, డైరెక్టర్లు ఈ అవార్డును అందుకున్నారు. 2017లో స్థాపించిన అంజనీపుత్ర ఎస్టేట్స్ ప్రముఖ కంపెనీగా గుర్తింపు పొందింది. 5వేల మందికి పైగా కస్టమర్ల ఆదరాభిమానాలు పొందింది. సక్సెస్‌కు కారణమైన మార్కెటింగ్ ఏజెంట్లకు, కస్టమర్లకు చైర్మన్ గుర్రాల శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మానం


హాజీపూర్ ప్రజాప్రతినిధులతో మాజీ ఎమ్మెల్యే

హాజీపూర్, జూలై 2: మండల ప్రజాప్రతినిధులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు తన నివాసంలో సన్మానించారు. నేటితో పదవీ కాలం పూర్తి చేసుకుంటున్న ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, వైస్ ఎంపీపీ రమాదేవి, ఎంపీటీసీలు వెంకటేష్, సోగాల సుజాత, లతశ్రీ, జెడ్పీ కో ఆప్షన్‌సభ్యుడు నయీంభాషాలను సన్మానించారు. మొగిలి శ్రీనివాస్, మాజీ సర్పంచు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కన్నెపల్లి, జూలై 2: ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి అన్నారు. మంగళవారం జన్కాపూర్‌లో రైతు వేదికను ప్రారంభించారు. అనంతరం కన్నెపల్లికి చెందిన 23 మందికి, భీమినికి చెందిన 4, వేమనపల్లికి చెందిన 10 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని, ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ సంక్షేమఫలాలు అందుతాయన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నానన్నారు. వన మహోత్సవంలో భాగంగా రైతువేదిక ఆవరణలో మొక్కలు నాటారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో గంగామోహన్, ఆర్ఐ కిషన్‌రావు, ఏపీవో శ్రీనివాస్, నాయకులు నర్సింగరావు, వైస్ ఎంపీపీ రాకేశ్‌శర్మ, ఎంపీటీసీ సంతోష్‌కుమార్, కన్నెపల్లి, భీమిని, వేమనపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, సాబీర్ అలీ, నాయకులు మహేష్‌గౌడ్, శ్రీహరిరావు, మాజీ సర్పంచులు, మాజీ ఉపసర్పంచులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి


విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

భూ సమస్య పరిష్కరించాలి

భీమిని: చిన్నతిమ్మాపూర్ గ్రామపరిధిలోని తంగలపల్లిలో భూ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతిపత్రం అందించారు. గ్రామానికి చెందిన 600 ఎకరాల భూమి ఉండగా సర్వే నంబరు 1 నుంచి 59 వరకు ఉన్న భూమిలో కాస్తులో ఉన్నప్పటికీ ధరణిలో నిషేధిత జాబితాలో ఉన్నాయన్నారు. పట్టాదార్ పాసు పుస్తకాలు ఇవ్వడం లేదని, రైతు భరోసా, క్రాప్ లోన్ కోల్పోతున్నారని పేర్కొన్నారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్‌కు గతంలో ఫిర్యాదు చేశామని గ్రామ స్థులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు గాదం లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచు భూమయ్య, నాయకులు నర్సింగరావు, గోపా ల్, కిషన్, గట్టయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే

బెల్లంపల్లి: సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కి చెందిన ఇద్దరు విద్యార్థులు ఐఐటీలో సీట్లు సాధిం చారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ రెండు దశల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో గట్టు శ్రీహర్ష్, తేజావత్ సిద్దులు ఐఐటీలో సీట్లు సాధించగా మంగళవారం విద్యార్థులను ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి సన్మానించారు. మున్ముందు మరింత ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, జేపీపీ శ్యాంసుందర్‌రాజు,పేరెంట్స్ కమిటీ గౌరవాధ్యక్షుడు తిరుపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం


మంచిర్యాల మార్కెట్‌లో నిలిచిన నీరు

ఏసీసీ, జూలై 2: మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం మేఘావృతమై మబ్బులు కమ్ముకుని ఉండగా సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం ప్రారంభమై దాదాపు గంట సేపు కుండపోతగా కురిసింది. డ్రైనేజీలు పొంగిపొర్లగా రోడ్లపై నీరు నిలిచింది.

నస్పూర్: నస్పూర్‌లో భారీ వర్షం కురిసింది. సీసీసీ కార్నర్ నుంచి నర్సయ్య భవన్ వరకు ప్రధాన రహదారిపై వరద నీరు చేరింది. వర్షం కారణంగా సుందరయ్య కాలనీ వార సంత వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాతావరణం చల్లబడింది.

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణం, మండలంలో భారీ వర్షం కురిసింది. పట్టణంలోని జీఎం కార్యాలయం చౌరస్తా ఎదుట, యూనియన్ బ్యాంకు లైన్‌లో రోడ్లపై నీరు నిలిచింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అలాగే రోడ్లపై విక్రయాలు జరుగుతున్న చిరు వ్యాపారులు వర్షం పడడంతో ఇబ్బందులకు గురయ్యారు.

భీమారం: మండలంలో భారీ వర్షం కురిసింది. కొన్ని రోజులుగా ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలు ఊరట చెందారు. అలాగే పత్తి మొక్కలు పెట్టిన రైతులు వర్షం పడడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో చెరువులు,కుంటలు నిండుతాయని వరి నాట్లు వేసుకుని రైతులు అంటున్నారు.

చెన్నూరు: చెన్నూరు పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వర్షం కురిసింది. నాలాల్లోని నీరు రహదారులపై ప్రవహించడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఎండాకాలం ముగిసినప్పటికి వర్షాలు పడకపోవడంతో మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో ప్రజలు ఊరట చెందారు.

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కాసిపేట, జూలై 2 : ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగిపడిన కొమ్మలు పట్టించుకోని అధికారులు కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగించారు.

డీఏవీ స్కూల్‌లో అందరినీ చేర్చుకోవాలి

కాసిపేట, జూలై 2: దేవాపూర్ డీఏవీ పాఠశాలలో అన్ని కులాల పిల్లలకు అడ్మిషన్‌లు ఇవ్వాలని ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ అలీ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఏవీ పాఠశాలలో కొందరికి అడ్మిషన్‌లు ఇవ్వకుండా అవమానపరుస్తున్నారన్నారు. ఎస్‌కె జహీర్ అహ్మద్, ఖైరత్ హుస్సేన్, ఎస్‌కె సాబీర్, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

- పోలీసుస్టేషన్‌లో కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

ఆసిఫాబాద్, జూలై 2: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుపై కోవ లక్ష్మి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీగా పోటీ చేసిన నాయకురాలు ఆత్రం సుగుణ ఆదివాసీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కోవ లక్ష్మి చిత్రపటాలను రాక్షసిగా చిత్రీకరణ చేసి విలేకరుల సమావేశంలో ప్రదర్శిస్తూ మాట్లాడారు. ఆసిఫాబాద్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడం ఎమ్మెల్యే కోవ లక్ష్మి నీచ రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రజాప్రతినిధిగా ఉండి కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జిమంత్రి సీతక్క అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలకు వస్తే ఇక్కడి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో మంత్రులు ప్రజల సమస్యలను విస్మరించి కేసీఆర్ ఫాంహౌస్ చుట్టు తిరుగుతూ పర్సెంటేజీలు పొందారని విమర్శించారు. ఆదివాసీల అభ్యున్నతికి తపించే మంత్రి సీతక్కపై పిచ్చి మాటలు మానుకోవాలని హితవు పలికారు. అనంతరం ఎమ్మెల్యేపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వందన, రాజేంద్ర కుమారి, జ్యోతి, కళావతి, శైలజ, ఇందిరా, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావుపై అనుచిత వ్యాఖ్యాలు చేసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట జాతీయ రహదారిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావుపై అనుచిత వాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యేపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇంత వరకు పోలీసులు పట్టించుకోవటం లేదన్నారు. ఈ సందర్భంగా సీఐ చిట్టిబాబు కాంగ్రెస్‌నాయకులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. రాస్తారోకోలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేష్, దేవాజీ, కిషన్‌గౌడ్, చిరంజీవి గౌడ్, ఆత్మరాం నాయక్ పాల్గొన్నారు.


కోవ లక్ష్మి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకులపై ఎమ్మెల్యే ఫిర్యాదు


ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, జూలై 2: ఆదివాసీ మహిళా ఎమ్మెల్యే అని చూడకుండా నోటికి వచ్చినట్టు దుర్భాషలాడిన కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి మంగళవాం రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడురోజుల క్రితం రెబ్బెన మండలంలో నిర్వహించిన అభివృద్ధిపనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ప్రొటోకాల్‌పాటించకుండా అవమాన పర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలోఎంపీపీ జుమిడి సౌందర్య, బీఆర్ఎస్ మహిళ విభాగం నాయకురాలు పద్మ, అన్నపూర్ణ, అరుణ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం రైతుల బారులు


గోదాంలో ఎరువుల కోసం వేచి ఉన్న రైతులు

జైనూర్, జూలై 2: స్థానిక మార్కెట్ కమిటీ గోదాంలో ఎరువుల కోసం రైతుల బారులు తీరుతున్నారు. ముఖ్యంగా డీఏపీ ఎరువు కొరత ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం మండలాల వారీగా ఎరువుల కోట అందజేస్తోంది. కాగా జైనూర్‌కు చుట్టు పక్కల ఉన్న లింగాపూర్, సిర్పూర్(యు) మండలాల రైతులు ఇక్కడే కొనుగోలు చేస్తుండడంతో స్థానికుల కు కొరత ఏర్పడుతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఆసిఫాబాద్, జూలై 2: ఇటీవల బదిలీలో భాగంగా నతన పాఠశాలలకు కేటాయించిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు మంగళవారం డీఈవో అశోక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆందురావ్, సుభాష్, ప్రశాంత్, శివానంద్, విజయరాణి, లావణ్య, వేణి తదితరులు పాల్గొన్నారు.

సార్ వెళ్లవద్దని విలపించిన విద్యార్థులు


ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణను పట్టుకొని రోదిస్తున్న విద్యార్థులు

కాగజ్‌నగర్, జూలై 2: కాగజ్‌నగర్ మండలం చింతగూడ ఎంపీపీఎస్ పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ బదిలీపై వెళుతుండడంతో విద్యార్థులు మంగళవారం గేటుకు అడ్డంగా కూర్చొన్నారు. తమ సారు కావాలని విద్యార్థులు విలపించడం స్థానికులను కలిచివేసింది.

గంజాయి కేసులో ఒకరికి పదేళ్ల జైలు శిక్ష

ఆసిఫాబాద్‌రూరల్/జైనూర్, జూలై 2: గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేశ్ మంగళవారం తీర్పు చెప్పారు. జైనూరు సీఐ అంజన్న తెలిపిన వివరాల ప్రకారం.... ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దినకర్ సునీల్ అనే వ్యక్తి ఆగస్టు 27, 2021న ఆటోలో 25 కిలోల 300 గ్రాముల గంజాయిని రవాణా చేస్తున్న క్రమంలో జైనూర్ పోలీసులు పట్టుకున్నారు. అందులో 25 కిలోల 300 గ్రాముల గంజాయిని గుర్తించారు. నిందితుడిని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో సదరు వ్యక్తిపై జైనూరు పోలీస్ స్టేషన్‌లో సుమోటగా కేసు నమోదు చేశారు. అప్పటి సై తిరుపతి, సీఐ హనుక్‌లు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. మంగళవారం సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో నింది తుడికి పది ఏళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున జగన్మోహన్ వాదించారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన డీఎస్పీ సదయ్య, జైనూరు సీఐ అంజన్న, ఎస్సై, లైజనింగ్ అధికారి రాంసింగ్‌లను జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్, జూలై 2: కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సాయంత్రం ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకొని కనువిందు చేశాయి. ఈ సందర్భంగా మోస్తరు వర్షం కురిసింది.

కాగజ్‌నగర్: పట్టణంలో ఈదురుగాలులతోకూడిన వర్షం కురిసింది. ఈదురుగాలు తీవ్రతకు విద్యుత్ సరప రా నిలిపి వేశారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలువడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు.


కాగజ్‌నగర్‌లో..


ఆసిఫాబాద్‌లో కురుస్తున్న వర్షం

దహెగాం: మండల వ్యాప్తంగా వర్షం కురిసింది. మండల కేంద్రంలో వార సంత కావడంతో వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చిరువ్యాపారులు, కూరగాయల వ్యాపారులు సైతం అవస్థలు పడ్డారు.

చింతలమానేపల్లి: మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసిం ది. గత కొన్ని రోజుల నుంచివర్షాలు పత్తి, వరి పంటలకు అనుకూలంగా కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులు పంట చేనులలో కలుపు తీత తీయడం, పత్తి సాళ్ల మధ్య ఉన్న పిచ్చి గడ్డిని తొలగిచడం వంటి పనులు చేపడుతున్నారు.

కెరమెరి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులు పత్తి సాళ్ల మధ్య గడ్డి తొలగించడం, ఎరువులు వేయడం లాంటి పనులు చేపడుతున్నారు.

అందని పశువైద్యం

- రెగ్యులర్ వైద్యుడు లేక రైతుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

బెజ్జూరు, జూలై 2: మండలకేంద్రంలోని పశు వైద్యశాలలో రెగ్యులర్ వైద్యుడు లేక పశువులకు వైద్యం అందడంలేదు. నాలుగేళ్లుగా ఇక్కడి పశువైద్యశాలలో డాక్టర్ పోస్టును భర్తీ చేయకపోవడంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. రానున్నది వర్షాకాలం కావ డంతో పశువులకు వివిధ రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఎక్కువగా పశువులకు వర్షాకాలంలోనే వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే అధి కారులు ఇక్కడి ఆసుపత్రిలో వైద్యున్ని నియమించకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

● వ్యాధులు వస్తే తప్పని ఇక్కట్లు..

జిల్లాలోనే అతిమారుమూల మండలమైన బెజ్జూరులో నాలుగేళ్లుగా పశువైద్యుడిని నియమించడం లేదు. దీంతో పశు వులకు వ్యాధులు వస్తే కాగజ్‌నగర్ పట్టణానికి తీసుకు పోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పశువులను వైద్యం కోసం పట్టణానికి తరలించాలంటే ఖర్చుతో కూడుకొని ఉంటుందని పశుపోషకులు వాపోతున్నారు. పశువులకు ప్రత్యేకంగా వాహనాన్ని సమకూర్చుకొని వెళ్లాల్సిన పరిస్థితులు ఉంటాయని దీంతో ఖర్చుతో పాటు సమయ భారం కూడా అధికమవుతోందని రైతులు వాపోతు న్నారు. వైద్యానికయ్యే ఖర్చు కంటే వాటిని తరలించేం దుకు ఎక్కువగా ఖర్చులు అవుతున్నాయని వాపోతున్నారు. స్థానికంగానే వైద్యం అందితే సమయభారంతో పాటు ఖర్చులు కూడా కలిసి వస్తాయని పోషకులు తెలుపుతున్నారు.

● నాలుగేళ్లుగా ఇన్‌చార్జితోనే..

మండల కేంద్రంలో నాలుగేళ్లుగా రెగ్యులర్ వైద్యుడు లేకపోవడంతో ఇక్కడి ఆసుపత్రిలో ఇన్‌చార్జి బాధ్యతలను పక్క మండల డాక్టర్‌కు అప్పగించారు. అయితే ఆ వైద్యుడు చుట్టపుచూపుగా వస్తున్నాడని దీంతో తమ పశువులకు సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. రోజురోజుకు పశు సంతతి తగ్గిపోతున్న తరుణంలో ఉన్న పశువులను పోషించుకోవడం తలకు మించిన భారంగా మారు తోందన్నారు. దీనికి తోడు ఏడాది పొడవునా పశువులకు రోగం కోసం ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పశువులకు వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున రెగ్యులర్ వైద్యుడిని నియమించాలని మండల పశుపోషకులు విజ్ఞప్తి చేస్తున్నారు.


మండల కేంద్రంలోని పశువైద్యశాల



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెంచికలపేట, జూలై 2: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఆల్బర్ట్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం విష జ్వరాలు ప్రబలే అవకాశాలు ఎక్కువని చెప్పారు. దానిని దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో గంగాసింగ్, కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల మార్కెట్‌ను అభివృద్ధి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మిల్లెట్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ రూరల్, జూలై 2: చిరుధాన్యాల మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజరాజేశ్వర్ మిల్లెట్ యూనిట్‌ను మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిరుధాన్యాలు అత్యధికంగా పోషక విలువలు కలిగి ఉంటాయని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేయడం ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సకాలంలో పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. యూనిట్ నిర్వహణకు వినియోగించిన పెట్టుబడి పని చేస్తున్న వర్కర్లు, అంగన్‌వాడీలకు చేస్తున్న పంపిణీ వివరాలను పరిశీలించారు. మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసేలా కృషి చేయాలని చెప్పారు. నిషేధిత ప్లాస్టిక్‌ను నిరోధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ రామకృష్ణ, డీపీఎం సారయ్య, ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: చిరుధాన్యాల(మిల్లెట్) యూనిట్ల ద్వారా అత్యధిక పోషక విలువలు కలిగిన ఆరోగ్యానికి దోహదపడే ఉత్పత్తుల ఉత్పాదకత జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం రెబ్బెన దేవులవాడలో సెర్ప్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మామ్స్ మిల్లెట్స్ ప్రాసెసింగ్‌యూనిట్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాలతో ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించకుండా నానో సంచులు వాడాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ దీపక్ తివారి, గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

రాయల్టీ డబ్బులు అందేలా చర్యలు



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్

బెజ్జూరు, జూలై 2: జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ రాయల్టీ డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రివాల్ అన్నారు. మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో మంగళవారం తునికాకు కూలీలతో మాట్లాడారు. పలు గ్రామాలకు చెందిన కొంత మంది కూలీలు రాయల్టీ డబ్బులు రావడం లేదని దృష్టికి తీసుకు వెళ్లారు. స్థానిక అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది కూలీల అకౌంట్ తప్పుగా నమోదు కావడంతో డబ్బులు ఆలస్యం జరిగిందని, ఇప్పటికే పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించామని చెప్పారు. రాని వారి వివరాలు సేకరించి పూర్తిస్థాయిలో వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మత్తడి అటవీ ప్రాంతాన్ని, ఎల్కపల్లి నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ఎఫ్ఆర్వో దయాకర్, డిప్యూటీ ఎఫ్ఆర్వో శ్రావణ్ తదితరులు ఉన్నారు.

అందుబాటులో మామిడి మొక్కలు

ఆసిఫాబాద్, జూలై 2: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని నాలుగు ఉద్యాన నర్సరీలలో నాణ్యమైన మామిడి, అలంకరణ మొక్కలు నామ మాత్రపు ధరలకే అందుబాటులో ఉంచామని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి మొక్క రూ.50, క్రోటాన్స్ అలంకరణ, మునగ, కరివేపాకు మొక్కలు రూ.20 చొప్పున విక్రయించనున్నామని పేర్కొన్నారు. వివరాలకు 9032313933లో సంప్రదించాలని సూచించారు.

సౌకర్యాలు నిల్



ఆసిఫాబాద్‌లోని మెడికల్ కళాశాల

రాష్ట్రంలో ప్రతీ జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం భావించింది. ప్రభుత్వ లక్ష్యం గొప్పదే అయినా కాలేజీల్లో తగిన సౌకర్యాలు కల్పించక పోవడం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) నిబంధనల మేరకు సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా ప్రభుత్వం దానిని పూర్తిగా విస్మరించింది.

- మెడికల్ కళాశాలలో మౌలిక వసతులు కరువు
- బోధనా సిబ్బంది భర్తీకి చర్యలు శూన్యం
- తాత్కాలిక భవనాల్లో వసతి గృహాలు
- పట్టించుకోని ప్రభుత్వం

ఆసిఫాబాద్ రూరల్, జూలై 2: జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. దానిలో భాగంగా జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసింది. భవన నిర్మాణ ఏర్పాట్లు 75 శాతం పూర్తి చేసి గత ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన మల్లారెడ్డి చేతుల మీదుగా కళాశాల ఆర్భాటంగా ప్రారంభించింది. కాగా కళాశాలకు కావాల్సిన మౌలిక వసతులు, సిబ్బందిని కేటాయించడంలో ప్రభుత్వాలు పెద్దగా శ్రద్ధ చూపడం లేదు. దీంతో మెడికల్ కళాశాల సమస్యలతో సతమతమవుతోంది. కనీస వసతులు కూడా లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

వంద మంది విద్యార్థులు..

జిల్లా కేంద్రంలోని అంకుసాపూర్ గ్రామ పరిధిలో ఉన్న మెడికల్ కళాశాలలో గత ఏడాది 100 మంది విద్యార్థులతో ప్రారంభించారు. మెడికల్ కళాశాలలో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు చేరారు. ఎన్నో ఆశలతో చేరిన వీరికి సమస్యలు తప్ప ఏమీ కనిపించడం లేదు. ప్రస్తుతం రెండో సంవత్సరానికి రానున్న కొద్ది రోజుల్లో సీట్ల భర్తీ కానుంది. కాగా ఇక్కడ వసతులు, తగినంత సిబ్బంది లేక పోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పేలా లేవు.

అరకొర సిబ్బంది..

మెడికల్ కళాశాలలో 17 మంది ప్రొఫెసర్లు, 27 మంది అసోసియెట్ ప్రొఫెసర్లు, 45 మంది అసిస్టెంట్లు, 25 మంది ట్యూటర్లు, 39 మంది అసిస్టెంట్ ట్యూటర్లు ఉండాల్సి ఉంది. కాగా కేవలం నలుగురు అసిస్టెంట్లు, ప్రిన్సిపాల్ మాత్రమే విధులు నిర్వహిస్తుండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా 16 మంది ఆఫీసు సిబ్బందిని నియమించినప్పటికీ వారికి కనీసం కార్యాలయ పనులు లేకపోవడంతో ప్రిన్సిపాల్‌కు తలనొప్పిగా మారింది. విద్యార్థుల వసతికి కూడా గదులు సరిగా లేవు. అమ్మాయిలకు మార్కెట్ కమిటీలో, అబ్బాయిలకు పాత డీఆర్‌డీవో కార్యాలయంలో తాత్కాలిక వసతి గృహాలు ఏర్పాటు కేటాయించారు. వీటిలో సమస్యలు నిత్యకృత్యమయ్యాయి. ఎవరితో చెప్పుకోవాలో తెలియక సమస్యలు పరిష్కారం కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే 100 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుత విద్యా సంవత్సరం కౌన్సెలింగ్ తర్వాత 100 మంది మళ్లీ చేరుతారు. ఇప్పటికే సమస్యలు ఉండగా వీరు అడ్మిషన్లు పొందితే సమస్యలు రెట్టింపు కానున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం..

నాగార్జునచారి, ప్రిన్సిపాల్



మెడికల్ కళాశాలలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదించాం. రానున్న రోజుల్లో సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నాం. ప్రస్తుతం నలుగురు అసిస్టెంట్లతో నెట్టుకొస్తున్నాం.

యువతను మోసగించడం సరికాదు



వాంకిడి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెంచికలపేట, జూలై 2: అధికారంలోకి వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసగించడం సరికాదని బీజేవైఎం నాయకులు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ గోపాల్‌కు మంగళవారం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూవినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నీళ్లు, నిదులు, నియమకాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసానికి గురవుతున్నారని గతంలో టీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ఒకే పంథలో నడుస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సంతోష్, కాంతారావు, పురుషోత్తం, బాపూజీ, రమేష్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేవైఎం నాయకులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేవై ఎం నాయకులు లక్ష్మణ్, ప్రభాకర్‌గౌడ్, తిరుపతి, సంజీవ్, సురేష్, పి.సురేష్, మల్లేష్,చందు, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, రోషన్, శకావత్, విజయ్, రమేష్,నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: తహసీల్దార్ కార్యాలయంలో బీజేవైఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం నిరుద్యోగలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుచిత్, విలాస్, నరేష్, వేణు, శివకుమార్, బాపూజీ, కార్తీక్, మహేష్, బాలరాజు, శ్రీకాంత్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పాటుపడ్డాం

వాంకిడి, జూలై 2: వాంకిడి మండల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పాటుపడ్డామని జడ్పీటీసీ అజయ్‌కుమార్, ఎంపీపీ విమలాబాయి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. రెండు రోజుల్లో పదవీ బాధ్యతలు ముగుస్తున్నందున ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీలను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల పదవీ కాలంలో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, వంతెనల నిర్మాణాలను కోట్ల నిధులతో నిర్మించామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన ప్రతీ ఒక్క సంక్షేమ పథకం ప్రజలకు చేరేలా తాము కృషి చేశామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ పెంటయ్య, ఎంపీడీవో వరలక్ష్మి, తహసీల్దార్ రోహిత్, సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ పాల్గొన్నారు.

నివేదిక అందజేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, జూలై 2: జిల్లాలో ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై నివేదిక అందజేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నీతి అయోగ్, సంపూర్ణత అభియాన్ కార్యక్రమాల కింద జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల సంబంధిత పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై నివేదిక అందించాలన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ, సామాజిక అభివృద్ధి, ఆర్థిక చేకూర్పు 5 విభాగాలలో 39 అంశాలపై నిర్ణీత నమునాలు సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తుకారాంభట్, డీఈవో అశోక్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా పశు వైద్యాధికారి సురేష్, ఏపీడీ రామకృష్ణ, నీతి అయోగ్ సమన్వయకర్త మణివేలు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ఆసిఫాబాద్ రూరల్, జూలై 2: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని చిలాటిగూడ గ్రామంలో మంగళవారం హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ రాంకిరణ్, కార్యదర్శి, గ్రామస్థులు సురేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా'పై ప్రజాభిప్రాయ సేకరణ

బెజ్జూరు, జూలై 2: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణను డీసీఏవో మహమూద్ నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చేందుకు ప్రజల అభిప్రాయం సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీ స్కీంలలో భాగంగా రైతులకు భరోసా ఇచ్చేందుకు అభిప్రాయాలను సేకరిస్తుందన్నారు. బెజ్జూరు మండలంలో సేకరించిన అభిప్రాయ సేకరణలో ఎక్కువ శాతం మంది రైతు భరోసా పది ఎకరాల వరకు ఉన్న భూముల రైతులకు ఇవ్వాలని కోరారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్, అసిస్టెంట్ రిజిస్టర్ అనంతలక్ష్మి, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీవర్ధన్, బాపు, శ్రీహరి, రాజారాం, సీఈఓ సంజీవ్, కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు జావీద్‌అలీ, సతీష్, నరేందర్‌గౌడ్, హకీం పాల్గొన్నారు.

గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు

జైనూర్, జూలై 2: మండలంలో నిషేధిత గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సందీప్ కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలో పలు దుకాణా లను మంగళవారం ఎస్సై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైనూరులోని కొన్ని దుకాణాల్లో గుట్టు చప్పుడుగా గుట్కాలు అమ్ముతున్నట్లు సమాచారం ఉందని చెప్పారు. అలాంటి వారు మానుకోవాలని చెప్పారు. పట్టుబడితే చట్ట పరంగా కఠిన చర్యలు తప్పవన్నారు. గుట్కాలు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

రైతులకు అవగాహన

సిర్పూర్(టి), జూలై 2: వానాకాలంలో పంటల సాగుపై రైతులకు మంగళవారం రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. పెసర, కంది, మినుములు తదితర ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏడీఏ మనోహర్ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు పంటల దిగుబడులు కూడా పెరిగే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఎప్పటిక ప్పుడు కలుపు నివారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవోలు మధులత, రామకృష్ణ, ఏఈవో కవిత, నేహత బసుం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీటీసీలకు సన్మానం

సిర్పూర్(టి), జూలై 2: ఎంపీటీసీల పదవీ కాలం ముగుస్తున్నందున బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

చింతలమానేపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీటీసీ, ఎంపీపీ, కో ఆప్షన్‌లకు అభినందన సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధిహామీ వేతనాలు చెల్లించాలి

జైనూర్, జూలై 2: ఉపాధిహామీ పనులు వేతనాలు వెంటనే చెల్లించాలని మండలంలోని పవర్‌గూడ ఉపాధిహామీ కూలీలు భుతాలె గోవింద్, గాయక్వాడ్ దత్త, పాయిక్‌రావ్ దత్త, లక్ష్మీబాయి కోరారు. పవర్‌గూడలో మంగళవారం సంబంధిత కూలీలు విలేకరుతో మాట్లాడారు. ఏప్రిల్, మే, నెలలో చేసిన పనుల వేతనాలు ఇంత వరకు రావడం లేదని చెప్పారు. వేతనాలు ఇవ్వాలని పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ ఇవ్వలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వన మహోత్సవంపై పట్టింపేదీ?

జైనూర్, జూలై 2: మండలంలో వన మహోత్సవం చేపట్టడం లేదు. జూలై 1 నుంచి 7వ తేదీ వరకు అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం జరగాల్సి ఉంది. వన మహోత్సవం కార్యక్రమం కింద మొక్కల పెంపకం, వాటి సంరక్షణపై సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ప్రస్తుతం అలాంటి కార్యక్రమాలు జరుగడం లేదని స్థానికులు చెబుతున్నారు. వన మహోత్సవంపై మంగళవారం సంబంధిత అటవీ అధికారి జ్ఞానేశ్వర్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి సమాచారం, ఆదేశాలు లేవని తెలిపారు.

సింగరేణి సమాచారం



రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు తీయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సింగరేణి సీఎండీ ఎన్ బలరాం

శ్రీరాంపూర్, జూలై 2: ప్రతి రోజు 2 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి, రవాణా చేయాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. అన్ని ఏరియాల జీఎంలతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలంటే రోజు 2 లక్షల టన్నుల చొప్పున వెలికితీయాలన్నారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్, ఇతర కంటిన్యూయస్ మైనర్ల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. వర్షాకాలంలో ఉత్పత్తికి విఘాతం కలుగకుండా హాల్ రోడ్లను ఎప్పటికప్పుడు పరిష్కపర్చుకోవాలని, క్వారీల్లో నిలిచిన వర్షం నీటిని పంపింగ్ చేయాలని, ఏదైనా షిఫ్ట్‌లో లక్ష్యాన్ని చేరకపోతే మరుసటి షిఫ్ట్‌లో భర్తీ చేయాలన్నారు. ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి అన్ని ఏరియాలకు అవసరమైన యంత్రాలను అందించామని, ఓబీ తొలగించేందుకు ఏజెన్సీలను నియమించామని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్ (ఈ అండ్‌ఎం) డి సత్యనారాయణరావు, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్‌వికె శ్రీనివాస్, డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) జి వెంకటేశ్వర్ రెడ్డి, జీఎం(కోఆర్డినేషన్) జి దేవేందర్, జీఎం(సీపీపీ) రవి కుమార్, అన్ని ఏరియాల జీఎంలు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణికే గనులను కేటాయించేలా చూడాలి



ఉప ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మందమర్రి టౌన్, జూలై 2: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వేలంపాటలు సరికాదని, తెలంగాణాలోని బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనక్‌ప్రసాద్ వినతి చేశారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రిని కలిసి గనుల వేలం గురించి ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే సింగరేణిలో ఐదు సంవత్సరా లోపు 15 గనులకు పైగా మూతపడనున్నాయని తెలిపారు. మందమర్రిలో కేకే 6 ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిందని, అపార బొగ్గు నిక్షేపాలు ఉన్నటువంటి శ్రావణపల్లితో పాటు ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, కోయగూడెం బ్లాకులను సింగరేణికి ఇచ్చేలా చూస్తే ఉపాది అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీఎండీ బలరాం, జాతీయ కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేలానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్, జూలై 2: సింగరేణి బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య పిలుపునిచ్చారు. ఎస్ఆర్‌పి 1, ఎస్ఆర్‌పి 3 గేట్ మీటింగ్‌లతో పాటు నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. 2015లో కేంద్ర ప్రభుత్వం ఎంఎండిఆర్ చట్టాన్ని తీసుకువచ్చి దేశంలోని బొగ్గు గనులను వేలం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. చట్టం ఏర్పాటయ్యే సమయంలో బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో మద్దతు తెలిపారని చెప్పారు. కేసీఆర్ అనుమాయులకు వచ్చేలా సింగరేణి వేలంలో పాల్గొనకుండా చేసి ఇప్పుడు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. నామినేషన్ పద్ధతిన సింగరేణి గనులు సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బిడ్డ కిషన్ రెడ్డి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్నందున ప్రధాన మంత్రికి వివరించి సింగరేణికి ఇప్పించే ప్రయత్నం చేయాలని కోరారు. గతంలో కేటాయించిన రెండు గనులతో పాటు ప్రస్తుతం వేలం వేయాలనుకుంటున్న గనులను నామినేషన్ పద్ధతిన సింగరేణి సంస్థకు అప్పగించేలా కేంద్రానికి నచ్చజెప్పాలని తాము రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. వేలం నిలిచిపోయే వరకు ఈ నెల 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు పలు ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి కె. వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, సీపీఐ నాయకులు రామడుగు లక్ష్మణ్, లింగం రవి, మేకల దాసు, చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, మైనింగ్ స్టాఫ్ కార్యదర్శి మారేపల్లి సారయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ కార్యదర్శులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణే ధ్యేయం

మందమర్రి టౌన్, జూలై 2: మందమర్రి ఏరియాలో యాజమాన్యం ప్రమాదాల నివారణే ధ్యేయంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఏరియాలోని కాసిపేట, కాసిపేట 2, శాంతిఖనితో పాటు కేకే 5, ఏరియా స్టోర్స్, వర్కుషాపు, సీఎస్‌పీలలో అధికారులు కార్మికులకు షిఫ్టుల వారీగా రక్షణా సూత్రాలను తెలియజేస్తున్నారు. ఈ మధ్య కాలంలో అనుకోని ప్రమాదాలు జరిగి సింగరేణి వ్యాప్తంగా ముగ్గురు కార్మికులు మృతి చెందారని, ఆ ప్రమాదాలను ఏ విధంగా జరిగాయో, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మంగళవారం ఏరియాలోని కేకే 5 గనిపై సింటార్ ఎస్‌వోఏం విజయ్‌కుమార్ మాట్లాడుతూ ముందుగా ప్రతీ కార్మికుడు విధి నిర్వహణలో రక్షణ సూత్రాలను విస్మరిస్తే జరిగే పర్యవసనాలను క్లుప్తంగా వివరించారు. అనంతరం రక్షణ ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో గని మేనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బొగ్గు బావుల వేలంపై సమావేశం

మందమర్రి టౌన్, జూలై 2: బొగ్గు బ్లాకుల వేలంపై బుధవారం హైదరాబాద్‌లో కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, రచయిత్రి విమలక్క, కార్మిక సంఘాల జేఏసీ నాయకులు హాజరవుతున్నారు. సింగరేణికి సంబంధించి బ్లాకులను సింగరేణికి కేటాయించాలని నిర్ణయించనున్నారు. సంస్థ అభివృద్ధి, ఉపాది అవకాశాలపై తీర్మానాలు చేయనున్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

శ్రీరాంపూర్, జూలై 2: వర్షాకాలంలో సింగరేణి ఉద్యోగుల కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏరియా జీఎం బి. సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జీఎం కార్యాలయంలో సివిల్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉద్యోగుల కాలనీలలో చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. పరిశుభ్రమైన నీటిని అందించాలని, గుంతల్లో, రోడ్లపై నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి తప్పు జరిగినా సివిల్ విభాగం అధికారులదే బాధ్యత అని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎస్‌ఓ టు జీఎం గోపాల్ సింగ్, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, ఇన్‌చార్జి డీజీఎం(సివిల్) రాము, సివిల్ ఎఈలు సత్యనారాయణ, గట్టయ్య, ఏరియా వైద్యాధికారి డాక్టర్ లోకనాథ్ రెడ్డి, సివిల్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పాన్‌కార్డు, ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి

శ్రీరాంపూర్, జూలై 2: సింగరేణి ఉద్యోగులు తమ పాన్‌కార్డులను ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాలని డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఇప్పటి వరకు 700 మంది ఉద్యోగులు తమ పాన్‌కార్డులను ఆధార్ కార్డులతో అనుసంధానం చేసుకోలేదని పేర్కొన్నారు. ఆదాయపు పన్ను శాఖ నిబంధనల ప్రకారం ఆధార్, పాన్‌కార్డులకు అనుసంధానం లేనిపక్షంలో వేతనం నుంచి 20శాతం అపరాధ రుసుం వసూలు చేస్తారని తెలిపారు. వెంటనే ఉద్యోగులు పాన్‌కార్డు, ఆధార్‌కార్డు అనుసంధానం చేసుకోవాలని కోరారు.

'బొగ్గు బావుల వేలం రద్దు చేయాలి'

మందమర్రి టౌన్, జూలై 2: బొగ్గు బావుల వేలంను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్ అన్నారు. స్థానికంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని చెప్పారు., పరిశ్రమలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టి ప్రత్యక్షంగా వారి సంపదకు పాటుపడుతుందన్నారు. నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ వేల కోట్ల లాభాలు సాధిస్తున్న సింగరేణిపై కూడా కేంద్రం కుట్ర పన్నుతుందని, దీనిపై కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో వెల్ది సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.